**చేకూరపాడు గ్రామం లోని శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూల్ వజ్రోత్సవం సందర్భంగా**

**పాఠాశాల స్థాపన : 1962 వ సంవత్సరం**

శిరిగిరి సుబ్బయ్య గారి కుమారుడు సింగయ్య, చేకూరపాడు గ్రామము.

**1962 -1968 సంవత్సరం SSLC ప్రధమ బ్యాచ్ విద్యార్థి.**

మహానుభావులు శ్రీ శ్రీ శ్రీ ఉప్పలపాటి నాగేశ్వర రావు పంతులుగారు తన ఇంట్లోనే ఎలిమెంటరీ స్కూలు పెట్టి ప్రధానోపాధ్యాయులుగా 5వ తరగతి వరకు పిల్లలకు విద్య బోధించేవారు. వారికి తోడుగా కీర్తిశేషులు శ్రీ పాదర్తి వెంకటేశ్వర్లు (కోమటి పంతులు, అమ్మనబ్రోలు) విద్యను బోధించేవారు. తదుపరి, శ్రీ ఆళ్ల వెంకట సుబ్బయ్య గారు (చీర్వానుప్పలపాడు) ఉపాధ్యాయులుగా నియమింపబడినారు. ఆ స్కూలులో విద్యార్థులు 5 వ తరగతి వరకు చదివేవారు. పై చదువులకు ఒంగోలు వెళ్ళాలి. అది అందరకి సాధ్యంకానిది. ఆ ఇబ్బందులను గుర్తించిన చిరస్మరణీయుడు శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పేరయ్య చౌదరిగారి ఆలోచనల రూపకల్పనే - ఈ **"శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూల్"**.

చేకూరపాడు గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన గౌరవనీయులు కీర్తిశేషులు శ్రీ శిరిగిరి పేరయ్యగారు పెద్దగా చదువులేకపోయిన స్వయంకృషితో పొగాకు వ్యాపారంలో అభ్యున్నతి సాధించి, చదువుకు గల ఆవశ్యకతను గుర్తించి తాను పుట్టిన గడ్డపై పిల్లల ఉన్నతచదువులకు ఒక ఉన్నతపాఠశాల పెడదామనేతలంపే ఈ శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలుకు నాంది పలికింది. చేకూరపాడు గ్రామం మధ్యలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఉండేది. దేవాలయ ఆదాయంలో కొంతభాగం హై స్కూలుకు వినియోగిద్దామనే ఆలోచనే - ఈ శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలుకు పునాది.

చేకూరపాడు పెద్ద భూస్వాములు ఉన్నగ్రామంకాదు. స్థితిగల రైతులు కొద్దిమంది ఉండేవారు, మిగిలిన అందరూ సామాన్య రైతులు. చేకూరపాడులో అన్ని వర్ణములవారు అనగా కొద్దిమంది బ్రాహ్మణులు, వైశ్యులు, విశ్వబ్రాహ్మణులు, ముస్లింలు, దూదేకుల

సాహేబులు, కుమ్మరి, చాకలి, వడ్డెర, హరిజనులు, క్రైస్తవులు ఉన్నారు. అన్ని వర్ణములలోని పిల్లలు పై చదువులు చదవటానికి ఇబ్బందులు పడుతున్నతరుణంలో, పై చదువులు చదివిన శ్రీ శ్రీ శ్రీ వడ్డేళ్ళ వీరయ్య చౌదరిగారు గ్రామపెద్దల సహకారంతో, ఈ స్కూల్ నిర్మాణంలో చేసిన కృషి గణనీయమైనది. అన్నివిధాలుగా శ్రీశ్రీశ్రీ వడ్డేళ్ళ వీరయ్య చౌదరి గారి సేవలు ఎంతో విలువైనవి, వెలకట్టలేనివి.

1962 మే నెలలో కరవది హై స్కూలులో 6 వ తరగతి ఎంట్రన్స్ పరీక్షలు వ్రాయటానికి చేకూరపాడు నుండి మేము ముగ్గురం (శిరిగిరి సింగయ్య, శ్రీ కొమ్మినేని సత్యనారాయణ, శ్రీ పోకూరి వెంకటేశ్వర్లు) పోయి పరీక్షలు వ్రాసి పాస్ అయ్యాము. ఆ వెంటనే చేకూరపాడులో శ్రీ వేణుగోపాల స్వామి హై స్కూలుకు పర్మిషన్ వచ్చింది. మేము ఈ స్కూలులోనే చేరాము. మాతోపాటు చేకూరపాడు నుండి దాదాపు 20 మంది, చుట్టుప్రక్కల గ్రామాలనుండి 35 మంది, మొత్తం 55 మందితో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలు 6 వ తరగతి ప్రారంభమైనది.

ప్రారంభంలో శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పెద్ద వెంకయ్య చౌదరి గారి పశువుల కొష్టంలో, గతుకుల నేలమీద పరదాలు వేసుకుని మా మొదటి తరగతులు ప్రారంభం అయినవి. తొలినాళ్లలో కీర్తిశేషులు శ్రీ వడ్డేళ్ళ వీరయ్య చౌదరిగారు, కీర్తిశేషులు శ్రీ శిరిగిరి వెంకటేశ్వర్లుగారు, శ్రీ శిరిగిరి సుబ్బారావుగారు పాఠాలు చెప్పేవారు. రెండు నెలలు గడచిన పిదప శ్రీ వెల్ది వెంకటేశ్వర్లుగారు మొట్ట మొదటి ఉపాధ్యాయులుగా నియమింపబడ్డారు. ఒంగోలు మునిసిపల్ హై స్కూలులో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేసిన కీర్తి శేషులు మట్టా రామయ్యగారు ప్రధానోపాధ్యులుగా నియమింపబడినారు. అయన ఇంగ్లీష్ క్లాస్ కు వచ్చేవారు. కొత్తపట్నం కీర్తి శేషులు శ్రీ శ్రీ శ్రీ కాండూరి వెంకటరమణాచార్యులుగారిని సంస్కృతం ఉపాధ్యాయులుగా నియమించారు. శ్రీ వీరబ్రహ్మం గారిని (ఇనుమనమెళ్ళూరు) డ్రిల్ల్ మాస్టర్ గా నియమించారు. శ్రీ శ్రీ శ్రీ గడ్డిపాటి సుబ్బారావు గారిని (ఈదుమూడి) హిందీ పండిట్ గాను, శ్రీ శ్రీ శ్రీ బాచిన నరసింహారావు గారిని (ఈదుమూడి) సైన్స్ మాస్టర్ గాను నియమించారు. వారు విద్యార్థుల చదువుకోసం విశేషకృషి చేశారు.

అప్పుడు 6వ తరగతి సంస్కృత పుస్తకాలు (1) వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ (మద్రాసు) నుండి తెలుగు లిపిలో; (2) వారణాసి (ఉత్తర ప్రదేశ్) నించి దేవనాగరి లిపిలో  పార్సెల్ ద్వారా కరవది రైల్వే స్టేషనుకు వచ్చేవి.  స్కూల్ వదిలిన తరువాత పంతులు, మేము కరవది రైల్వే స్టేషనుకు పోయి పార్సెల్ తెచ్చేవాళ్ళం.

తొలి S P L గా నన్నే ఎన్నుకోవటం జరిగింది. స్కూల్ క్లాసులు మాతోపాటు  వరుసగా పెరుగుతూ వస్తున్నందున నేను S P L  గా 5 సార్లు ఉండటం జరిగింది. ఒకసారి శ్రీ కొమ్మినేని సత్యనారాయణ S P L  గా ఉండటం జరిగింది.

చేకూరపాడులో పోస్ట్ ఆఫీస్ లేదు.  స్కూలుకు సంబధించిన ఉత్తరాలు ఇనమనమెళ్ళూరు పోస్ట్ ఆఫీస్ కు వచ్చేవి. అప్పుడు శ్రీ శ్రీ శ్రీ సింగరాచార్యులు పోస్ట్ మాస్టరుగా ఉండేవారు.  నేను వారానికి రెండు సార్లు (మాకు సైకిల్ ఉండేది) మా  సైకిల్ అడ్డ కాళ్లతో తొక్కుకుంటూ, మధ్యాహ్నం అన్నానికి వదిలినప్పుడు ఇనమనమెళ్ళూరు పోయి స్కూలు ఉత్తరాలు తెచ్చేవాడిని.

ఆ ఇబ్బందులను గ్రహించి శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పేరయ్య చౌదరిగారు పోస్ట్ ఆఫీస్ కోసం ప్రయత్నాలు చేయగా తరువాత కాలంలో చేకూరపాడులో పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయటం జరిగింది.  పోస్ట్ మాస్టర్ గా కీర్తిశేషులు శ్రీ శ్రీ శ్రీ కొమ్మినేని వెంకయ్య గారు సేవలందించారు.

శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం శిథిలావస్థకు చేరిన పరిస్థితిని గుర్తించి, దాని పునర్నిర్మాణం కొరకు కూడా, శ్రీ శిరిగిరి పేరయ్య చౌదరి గారు తనవంతు సహాయ సహకారాలు అందించారు.

తాను పుట్టిన ఊరికి అన్ని విధాలా సౌకర్యాలు కల్పించడంలో ఎంతో కృషిచేసిన చిరస్మరణీయులు శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పేరయ్య చౌదరిగారికి, వారికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు హృఉదయపూర్వక అంజలి ఘటిస్తున్నాను.

1962 సెప్టెంబర్ నెల, 7 వ తారీఖున,  డాక్టర్ బెజవాడ గోపాల్ రెడ్డి (అప్పటి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మంత్రి వర్గంలో సమాచార, ప్రసార సంబంధాల శాఖామాత్యులు) గారిచే శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూలు నూతన భవనం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.  తరువాత, తరగతి క్లాసులు కొత్త భవనానికి మార్చబడినవి.  అప్పుడు 6వ తరగతి రెండు సెక్షన్లుగా ఏర్పాటుచేయడం జరిగినది. శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పేరయ్య

చౌదరిగారు కర్త కర్మ క్రియ అంతా తానై పాఠశాల స్థాపనకు చేసిన కృషి అభినందనీయమైనది.

అలాగే పాఠశాలకు డ్రిల్ల్ మాస్టర్ గా శ్రీ శ్రీ శ్రీ ముప్పవరపు సుబ్బా రావు గారు లైబ్రేరియన్ గా మరియు క్లర్క్ గా శ్రీ వడ్డినేని శేషయ్య గారు నియమించబడినారు.

మన పాఠశాల సంస్కృత పాఠశాల ఐనందున, పరిపూర్ణంగా సంస్కృత పండితులు లేనందున తొలి బ్యాచ్ విద్యార్థులుగా మేము చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాము. SSLC పరీక్షలలో సంస్కృతం 200 మార్కులు ఉన్నందున, సంస్కృత ఉపాధ్యాయులు లేని కారణంగా SSLC లో తొలి బ్యాచ్ విద్యార్థులు చాలామంది ఉత్తీర్ణులు కాలేకపోయారు.

ఎన్ని ఒడిదుడుకులు ఉన్నప్పటికి తర్వాత కాలంలో ఉపాధ్యాయులను పూర్తిగా నియమించడం జరిగింది. ఎంతోమంది విద్యార్థులు శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలు లో చదివి వాళ్ళ భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుకున్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలులో పనిచేసిన ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులను సహనంగా ఓర్చుకొని పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి మేటి పౌరులుగా తీర్చిదిద్దారు.

విద్యాదానం చేసిన ఆ ఉపాధ్యాయులు అందరిని ఈ "**శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూలు**" షష్టి పూర్తి వార్షికోత్సవ సందర్భంగా స్మరించుకుంటూ, అందరికీ నమఃసుమాంజలిలు.

మన పాఠశాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల స్థాపనకు ఎంతో కృషి చేసిన కీర్తిశేషులు శ్రీ శిరిగిరి పెర్రయ్య చౌదరి గారికి, అయనకు సహాయ సహకారములనందించన గ్రామ ప్రజలకు హృదయాంజలి ఘటిస్తూ - విద్యాబోధన సేవలందించిన గురువులకు, గురుపూజ్యోత్సవ కార్యక్రమం మరియు పూర్వ విద్యార్థులనందరిని సమ్మేళన పరచి ఆనందానుభూతులను పొందుటకు కృషిచేస్తున్న వజ్రోత్సవ కార్యక్రమ నిర్వాహకులు అందరికీ పేరుపరునా ధన్యవాదములు.

ఇట్లు
**శిరిగిరి సింగయ్య**
1962 - 68 **బ్యాచ్**